''వసూ! చాలా థాంక్స్''

''ఎందుకూ?''

''మా అమ్మను నీ కన్నతల్లిలా చూసుకుంటున్నందుకు''

''భలేవారే! మిమ్మల్ని అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు చెప్పించి మిమ్మల్ని జీవితాంతం నాకు తోడుగా ఇచ్చిన అత్తగారంటే నాకెంతో గౌరవం. ఆమెకు నా కన్నతల్లిలా కాదు, నా కన్నబిడ్డలా చూసుకుంటాను'' భర్త గుండెలలో ఒదిగిపోతూ అంది వసుధ.

భర్త తోబుట్టువులను, తన తోబుట్టువులుగా ఆదరించి, అత్తమామలను తన తల్లిదండ్రులుగా చూసుకోవడంలో తన తల్లినే మించిన వసుధ లాంటి స్త్రీమూర్తులు ప్రతి మహిళకూ ఆదర్శం కావాలి.

'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలయి ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్న తరుణంలో ఆధునిక యువతులంతా వసుధలా ఆలోచిస్తే ఎంత బాగుండు' అనుకున్నాడు వసంత్.

**-డి.యశోధరాదేవి (అల్లూరు)**

# వక్రమార్గం

గ్రాడ్యుయేటయినా ఉద్యోగప్రయత్నాలు ఫలించలేదు. ఏదో చిన్న టెంపరరీ జాబ్‌లో వుండగా పెళ్లయిపోయింది. పెళ్లికి పెట్టిన సెలవుతో ఈ జాబూ పోయింది. అమ్మాయి చదువుకున్నదే డిగ్రీవరకూ... ఫలితం ఇప్పుడు ఇద్దరు నిరుద్యోగులు.

ఒక మిత్రుని సహాయం, సలహా మేరకు జిరాక్స్ మెషీన్స్ కొని మెయిన్ రోడ్‌లోనే చిన్న పోర్షన్ కమ్ షాపు తీసుకుని పని ప్రారంభించేం. ఊళ్ళో అందరూ మొదటి కాపీకి ఒక రూపాయి, తర్వాత కాపీలకు డెబ్భై ఐదు పైసల ఛార్జీ చేస్తున్నారు. కొత్తగా మార్కెట్‌లో ప్రవేశించిన మేము.. మొదటి కాపీతో సహా కాపీకి యాభై పైసలే ఛార్జిగా నిర్ణయించేం. ఈ మేరకు పాంప్లెట్స్ వేసి మంచి పబ్లిసిటీ ఇచ్చేం. డైలీ న్యూస్ పేపర్లలో పాంప్లెట్స్ పెట్టించాం. షాపు దగ్గర బోల్డ్ లెటర్స్‌తో 'ఎన్ని కాపీలైనా యాభై పైసలే' అని పెద్ద బోర్డు పెట్టాం.

నేనూ, మా శ్రీమతీ స్వయంగా జిరాక్స్ కాపీలు తీస్తూ నాణ్యతకి ప్రాధాన్యతనిస్తూ వచ్చేం. ఛార్జీ కూడా దాదాపు సగమే మిగిలిన వారితో పోలిస్తే. జిరాక్స్ మిషన్లూ కొత్తవి కావడంతో మంచి ఇంప్రెషన్ వచ్చింది. బహుశా ముహూర్త బలం మంచిదేమో.. మా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఊపందుకుంది.

దగ్గరలో జిరాక్స్ మిషన్లున్నా, టౌన్‌లో దూర ప్రాంతాలవాళ్లు కూడా మా దగ్గరకే రావడం మొదలుపెట్టారు. పిజి, ఇంజనీరింగ్ కాలేజీ టీచర్స్, విద్యార్థులు 'రేర్' పుస్తకాలకు పుస్తకాలే మా దగ్గరకు వచ్చి జిరాక్స్ తీయించుకుంటున్నారు. నెలనెలా ప్రోగ్రాములు పెట్టే సాహిత్య, సాంస్కృతిక సంస్థలవాళ్లు ఒక డిటిపి తీయించుకుని వందా, నూటయాభై కాపీలకు మా దగ్గరకే వస్తున్నారు.

మూడు నెలల్లోనే జిరాక్స్ మిషన్లమీద తీసుకున్న అప్పు సగంపైగానే తీరిపోయింది.

ఒక కాపీకి యాభై పైసలు చాలా తక్కువని మేం మీ వలన నష్టపోతున్నామని వాళ్లలాగే ఒక రూపాయి, డెబ్భై ఐదు పైసలు చెయ్యమని తోటి జిరాక్స్ యజమానులు మామీద ఒత్తిడి తెచ్చారు. దీనికి మేం అంగీకరించలేదు. మాకు విపరీతంగా లాభాలు వస్తుంటే నష్టమనే మాటనెలా ఒప్పుకుంటాం? ఒక ఫోను కూడా పెట్టించుకున్నాం. దాంతో మాకు ఊళ్లో విద్యాలయాలూ, గవర్నమెంటు ఆఫీసులు, ట్యుటోరియల్ కాలేజీలు, ఎల్ఐసి డవలప్‌మెంటు ఆఫీసర్లు, అందరి దగ్గర నుండి రోజు రోజుకు ఆర్డర్లు పెరుగుతూ వచ్చేయి.

మే, జూన్ మాసాల ఈ యేటి 'వడదెబ్బ' మాకూ...




అనగా మా బిజినెస్‌కూ తగిలింది. కాలేజీలూ, స్కూళ్లూ సెలవులూ వెరసి అన్‌సీజన్ అయింది. టర్నోవర్ తాత్కాలికంగా డౌనయింది. ఈ అవకాశం తీసుకుని నేనూ, మా శ్రీమతి వారం రోజులపాటు అవుటాఫ్ స్టేషను వెళ్ళాల్సి వచ్చింది. జిరాక్స్ దగ్గర మా నాన్నగారిని పెట్టేం. మేం వెళ్లిన రెండు రోజులకు నాన్నగారి దగ్గర్నుండి ఫోన్...

"ఓటర్స్ లిస్టు తీసుకుని ఒకతను వచ్చేడు. ఎమ్మార్వో వెంకటేశ్వరరావుగారు పంపేరట. ఇరవై వేల కాపీలు తియ్యాలట. అడ్వాన్సు అడిగేను. మీరు తెలుసని కాపీలు తీసేకే బిల్ సెటిల్ చేస్తారని చెబుతున్నాడు ఏం చెయ్యమంటావ్?"

ఎమ్మార్వో వెంకటేశ్వరరావుగారు మాకిదివరకు చాలా బిజినెస్ ఇచ్చేరు. వేలకు వేలు కాపీలు తీసిచ్చేం. వారి ద్వారా బిల్ సెటిల్మెంటు చాలా ప్రాంప్ట్ అని మా నాన్నకు చెప్పేను.

"వెంటనే తీసుకుని పని ప్రారంభించండి. ఎడ్వాన్సు అడగక్కర్లేదు. బిల్ సెటిల్మెంటు మేం వచ్చేక చూసుకుంటాం."

అన్ సీజన్ ఫుల్ సీజన్‌గా మారినందుకు ఈ వెంకటేశ్వరరావుగారికీ, ఆ వెంకటేశ్వర స్వామికీ ధన్యవాదాలు చెప్పుకున్నాం.

మా పనులు చూసుకుని వారానికల్లా తిరిగి వచ్చేం. మేం వచ్చేసరికి మా నాన్నగారు రాత్రింబవళ్లు కష్టపడి ఇరవై వేల కాపీలు తీసేసి గుట్టలుగా పేర్చి ఉంచేరు.

నేను ఎమ్మార్వోగారికి ఫోన్ చేసి కాపీలు తీసేపని పూర్తయిందని చెప్పేను. 'ఆయన కేంప్ నుండి రాగానే మీకు ఫోన్ చేయిస్తాం' అని సమాధానం వచ్చింది.

మర్నాడు పదకొండు గంటలకు ఫోన్ మోగింది.

"మీరు ఎమ్మార్వోగారి దగ్గర నుండి ఫోన్‌కోసం ఎదురు చూస్తున్నారని నాకు తెలుసు. వర్క్ ఆర్డరు పంపింది నేనే, ఎమ్మార్వో కాదు. గత ఎలక్షన్‌లోని పాత ఓటర్ లిస్టులవి. ఎమ్మార్వోగారి పేరుమీద ఆర్డరు పంపితే ఎడ్వాన్సు లేకుండానే మీరు కాపీలు తీస్తారని తెలుసు. ఆయన ద్వారా మీకు ఇదివరకు చాలా బిజినెస్ వచ్చిందనీ తెలుసు. ఈ ఇరవై వేల కాపీల బోగస్ ఆర్డరుతో మీ పని ఫినిష్! నేనూ నీ తోటి ఒక జిరాక్స్ ఓనర్నే. నువ్వు వచ్చి జిరాక్స్ మిషన్లు పెట్టి ఛార్జి సగానికి సగం తగ్గించేక ఈ ఊళ్లో మా వ్యాపారం తొంభై శాతం పడిపోయి, అంతా నీకే వస్తున్నది. నిన్ను దెబ్బ కొట్టడానికి ఇదే మార్గంగా ఆలోచించి, మరికొంత మంది జిరాక్స్ ఓనర్స్‌తో కలిసి పన్నిన కుట్ర ఇది. ఇప్పటికైనా నువ్వు మా మార్గం అంటే మేం ఫిక్స్ చేసిన ఛార్జీలనే నువ్వూ చెయ్యకపోతే... ఈ సారి మరో మార్గంలో దెబ్బతీస్తాం. ఇటువంటిదే మరో దెబ్బ తగిలితే నువ్వు నీ మిషన్లు మూసెయ్యాల్సి వస్తుంది. జాగ్రత్త"

హతాశుణ్ణయ్యాను. అసూయకిది పరాకాష్ట.

**-కె.రామారావు (మచిలీపట్నం)**